డొంకేశ్వర్‌లో ఇంటర్ కాలేజీ!

- ప్రభుత్వానికి అధికారుల ప్రతిపాదనలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు
- భవన నిర్మాణం కోసం రెండు స్థలాల పరిశీలన



డొంకేశ్వర్ స్వాగత తోరణం



స్థల పరిశీలన చేస్తున్న విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు

డొంకేశ్వర్: మండల వాసుల రెండు దశాబ్దాల కల నెరవేరనుంది. త్వరలోనే మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంటర్ కళాశాల ఏర్పాటు కానుంది. గ్రామస్తుల పట్టుదలకు ప్రజాప్రతినిధుల సహకారం తోడవడంతో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. మంగళవారం ఇంటర్ విద్యాధికారులు డొంకేశ్వర్‌లో పర్యటించారు. స్థల పరిశీలన చేయడంతో గ్రామస్తుల్లో ఆనందం నెలకొంది. చాలా ఏళ్లుగా ఇక్కడ ప్రభుత్వ ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు స్పందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఇటీవల ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ కూడా కళాశాల ఏర్పాటు చేయాలని అధికారులకు, ప్రభుత్వానికి లేఖ రాశారు. స్పందించిన జిల్లా ఇంటర్ విద్యాధికారి టి రవి కుమార్‌తో పాటు రెవెన్యూ అధికారులు ఇన్‌చార్జి తహసీల్దార్ వసంత్, ఆర్‌ఐ అశోక్‌సింగ్ మంగళవారం డొంకేశ్వర్‌కు వచ్చారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గ్రామ కమిటీ సభ్యులతో సమావేశమై చర్చించారు. భవన నిర్మాణానికి అనుకూలమైన స్థలం ఎక్కడుందో అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్‌ను నిర్మించడానికి రెండెకరాల స్థలం అవసరం ఉండగా, ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంతో పాటు రాజుల హన్మాండ్లు మందిరం వద్ద స్థలాలను పరిశీలించారు. వాటి సర్వే నంబర్లను నమోదు చేసుకున్నారు. వివరాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఇంటర్ విద్యాధికారి రవి కుమార్ తెలిపారు.

స్థల ఎంపిక పూర్తయితే..

మండల కేంద్రంలో ఇంటర్ కాలేజీ ఏర్పాటు దాదాపు ఖరారైనట్లే. స్థల ఎంపిక పూర్తయిన వెంటనే భవన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు, నిధులు మంజూరు చేయనుంది. అయితే, ఇంటర్ తరగతులను వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఖాళీగా ఉన్న తరగతి గదులను పరిశీలించారు. ఇక్కడే ల్యాబ్‌లు, లైబ్రరీ, ఫర్నీచర్, ఇతర సౌకర్యాలు కల్పించి లెక్చరర్లు, సిబ్బంది నియామకం చేపట్టాలని ఇంటర్ విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. పరిస్థితిని చూస్తుంటే వేసవిలో అడ్మిషన్లు తీసుకునే అవకాశం కూడా కనిపిస్తోంది. కాలేజీ ఏర్పాటైతే మండలంలోని 13 గ్రామాలతో పాటు నందిపేట్ మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునే అవకాశం ఉంటుంది.

వాగ్దేవి విద్యానికేతన్‌లో ఫుడ్ ఫెస్టివల్ డే

బోధన్: సాలూర మండల కేంద్రంలోని వాగ్దేవి విద్యా నికేతన్‌లో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసి పాత్రల్లో తీసుకొచ్చిన 135 రకాల ఆహార పదార్థాలు, తినుబండారాలను ప్రదర్శించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. పిల్లల తల్లిదండ్రులు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని విచ్చేసి ఆసక్తిగా తిలకించారు. పాఠశాల ప్రిన్సిపల్ పి రవీందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఇందిరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను స్వీకరిస్తున్న పిల్లల తల్లిదండ్రులు

విద్యుత్ అధికారుల పొలంబాట

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్‌లో ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులు పొలంలోకి వెళ్లి రైతులు ప్రమాదాలకు గురికాకుండా చేపట్టాల్సిన చర్యల గురించి డీఈ రమేశ్ వివరించారు. పొలాల మధ్య ఉన్న పైపులైన్‌లలో ప్లాస్టిక్ పైపులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఏఈ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రుణమాఫీ అందించాలి

రెంజల్: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బోర్గాంలో గోడప్రతులను మంగళవారం ఆవిష్కరించారు. జనవరి 9న ఆలిండియా డిమాండ్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుమ్ముల గంగాధర్, పుట్టి నాగన్న, పెద్దులు, పార్వతి రాజేశ్వర్, నసీర్, ఒడ్డెన్న, సిద్ధప్ప, పోశెట్టి, సుదర్శన్, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన



ఇళ్లను పరిశీలిస్తున్న చైతన్య కుమార్

రుద్రూర్: మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ చైతన్యకుమార్ మంగళవారం పరిశీలించారు. మండలంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. హౌసింగ్ డీఈ నాగేశ్వర్‌రావు పనితీరును అభినందించారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పూర్తి చేయించాలని సూచించారు. కామారెడ్డి హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి ఉన్నారు.

ఆలూర్‌లో స్థల పరిశీలన

పెర్కిట్: ఆలూర్ మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. డీఐఈవో రవి కుమార్, ఎంఈవో నరేందర్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీల మండల అధ్యక్షులు ముక్కెర విజయ్, కొత్తూరు గిరీశ్ మాట్లాడుతూ.. ఆలూర్ మండల కేంద్రానికి జూనియర్ కళాశాలను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, నడిశరం మల్లయ్య, ఉదయ్, హరీశ్, డాక్టర్ అరుణ్, అనిల్, సంజీవ్, భాస్కర్, గంగారెడ్డి, మల్లేశ్, జాన్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా న్యూఇయర్ వేడుకలు



ఆర్మూర్: పట్టణంలోని స్మైల్ స్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రఫిక్ గౌహర్, ప్రిన్సిపాల్ షబానా, ఉపాధ్యాయులు సింధూర, సవిత, స్వప్న, సింధుజ, సరిత, ప్రసన్న, శ్రావణి, రోజా, రేష్మ పాల్గొన్నారు.

నందిపేట్‌లో..

నందిపేట్: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ పబ్లిక్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి రామ గౌడ్, మాధురి, ప్రిన్సిపల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ చేతుల మీదుగా ఫోన్‌లు పోగొట్టుకున్న ఐదుగురు బాధితులకు మంగళవారం అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్లను కనుగొని బాధితులకు అందించినట్లు పేర్కొన్నారు.

మాక్లూర్‌లో..

మాక్లూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇద్దరు బాధితులు పోగొట్టుకున్న ఫోన్లను ఎస్సై రాజశేఖర్ వారికి అందజేశారు. బాధితులకు పోలీసులకు ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని అందజేస్తామని అన్నారు.

వాహనాల తనిఖీ

రుద్రూర్: మండల కేంద్రంలో ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. బ్రీత్ ఎనలైజర్ వినియోగించి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేశారు. ఏఎస్సై గంగాధర్, హెడ్ కానిస్టేబుల్ అంజాద్, సిబ్బంది ఉన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు





డొంకేశ్వర్: పింఛన్ డబ్బు కోసం వృద్ధులు, వికలాంగులు, మహిళలు డొంకేశ్వర్ పోస్టాఫీసు వద్ద రోజంతా పడిగాపులు కాశారు. సర్వర్ పని చేయకపోవడంతో పింఛన్ పుస్తకాలను పోస్టాఫీసు ముందు వరుసబెట్టి గంటల కొద్దీ నిరీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నా సర్వర్ రాలేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయమై పోస్టాఫీసు బీపీఎం మోహన్‌ను 'సాక్షి' వివరణ కోరగా, పై నుంచే సర్వర్ సమస్య ఏర్పడిందని, రోజంతా పని చేయకపోవడంతో లబ్ధిదారులను తిరిగి పంపించినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ



నందిపేట్: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలకు చెందిన విద్యార్థి అర్మాన్ కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించాడు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ బాలుర(అండర్-55 కిలోలు) విభాగంలో ఈ నెల 29న నిర్వహించిన పోటీల్లో పాల్గొనగా అర్మాన్ తృతీయ స్థానం పొంది కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగాను విద్యార్థి అర్మాన్‌ను మంగళవారం పాఠశాల డైరెక్టర్లు బండి రామాగౌడ్, మాధురి, ప్రిన్సిపాల్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీలో..



మానస



సంజన

మాక్లూర్: ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ సీఎం కప్ పోటీల్లో మండలంలోని మహాత్మా జ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన మానస, సంజన ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మరియాల స్వప్న మంగళవారం పేర్కొన్నారు. పీడీ వనజ, పావణి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

వేల్పూర్ వాసికి డాక్టరేట్



వేల్పూర్: మండల కేంద్రానికి చెందిన బొంబొతుల అరవింద్‌గౌడ్ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందినట్లు రామన్నపేట్ గ్రంథ రచయిత కంకణాల రాజేశ్వర్ మంగళవారం పేర్కొన్నారు. అరవింద్ గౌడ్ జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో సైంటిస్టుగా ఏడేళ్ల నుంచి పనిచేస్తూ పీహెచ్‌డీ చేశారన్నారు. ఆయన సమర్పించిన పెట్రోలజీ జియోకెమిస్ట్రీ అండ్ అసోసియేటెడ్ మినరలైజేషన్ ఇన్ గ్రానిటాయిడ్స్ ఆఫ్ పీజీసీ ఇన్ అండ్ అరౌండ్ మాల్ ఏరియా ఆఫ్ ఇష్టన్ దర్బారు కటింగ్ సౌత్ ఇండియా అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించిందన్నారు. అరవింద్‌గౌడ్‌ను ఓయూ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రభాకర్, ప్రొఫెసర్లు, సహోధ్యాయులు అభినందించారు.

ఆలయంలో చోరీ

నవీపేట: లింగాపూర్‌లో ఉన్న మహాలక్ష్మి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి దుండగులు ఆలయానికి ఉన్న తాళాలు పగులగొట్టి అమ్మవారి ఆభరణాలను ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి రిమాండ్

రెంజల్: మండలంలోని వీరన్నగుట్ట తండాకు చెందిన ఫకీరా అనే వ్యక్తిని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గ్రామానికి చెందిన జన్నీబాయి గృహనిర్మాణం చేస్తుండగా ఫకీరా వారం రోజుల నుంచి వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చి జన్నీబాయితో పాటు భర్త మంత్య, కూతురుపై చంపుతానని కర్రతో దాడి చేసినట్లు తెలిపారు. ఫకీరాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అంధకారంలో ప్రధాన ద్వారం

రుద్రూర్: జిల్లా అంతటా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దుకాణాలు, ప్రధాన వీధులు విద్యుద్దీపాల కాంతులతో మెరిసి పోతుండగా రుద్రూర్ మండల కేంద్రంలోని ప్రధానద్వారం మంగళవారం రాత్రి అంధకారంలో ఉంది. కొన్ని రోజులుగా ఇక్కడ వీధి దీపాలు వెలగడం లేదు. ఈ విషయాన్ని స్థానికులు గ్రామ పంచాయతీలో తెలిపినా సమస్య పరిష్కారం కావడం లేదు. కొత్త ఏడాదికి స్వాగతం చెప్పడానికి రుద్రూర్‌కు వచ్చే వారికి ప్రధాన ద్వారం అంధకారంతో దర్శనమిస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. కాకతీయులు కాలంలో నిర్మించిన ప్రధాన ద్వారాన్ని పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. దీన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

పింఛన్‌దారు నుంచి రూ.4 వేలు టోకరా

ఎడపల్లి: పింఛన్‌దారుని నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి రూ. నాలుగు వేలు టోకరా చేసిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎడపల్లికి చెందిన గుండారం నడిపి సాయిలు పోస్టాఫీస్ నుంచి పింఛన్ డబ్బులు రూ. నాలుగువేలు తీసుకొని ఇంటికి వెళ్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి అదనంగా మరో రూ.12 వేలు వస్తాయని ఎంపీడీవో ఆఫీస్‌కు వస్తే మిగతా డబ్బులు ఇస్తామని చెప్పి అతని చేతిలో ఉన్న నగదును తీసుకొని వెళ్లాడు. ఎంతవరకు అతనురాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి స్థానిక వ్యక్తి శేఖర్‌గౌడ్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



రెంజల్‌లో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని డొంకేశ్వర్, నందిపేట్, రెంజల్, పెర్కిట్, రుద్రూర్ మండల కేంద్రాల్లో పీఆర్టీయూ నాయకులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను పలువురు అధికారులు, పీఆర్టీయూ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. బోధన్ పట్టణ పద్మశాలి సంఘంలో సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టల్

- అమలుకాని నూతన డైట్
- భయం గుప్పిట్లో విద్యార్థులు



పెచ్చులు ఊడుతున్న వసతిగృహ భవనం



బీసీ బాలికల వసతి గృహం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలో సమస్యలు తిష్టవేశాయి. పట్టణంలోని రాంనగర్ కాలనీలో 36 ఏళ్ల క్రితం నిర్మించిన వసతిగృహం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండడంతో విద్యార్థినులు భయం గుప్పెట్లో వెల్లదీస్తున్నారు. వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులు 44మంది ఉన్నారు. కాగా రెండు నెలల క్రితం నాటి వాచ్‌మన్, కుక్, స్వీపర్‌లు విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురయ్యారు. సరిగా వండని ఆహార పదార్థాలను విద్యార్థులకు పెట్టేవారు. ఈ విషయం బయటకు రావడంతో సిబ్బందిని వివిధ డివిజన్లలోని హాస్టళ్లకు బదిలీ చేశారు. అలాగే విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందజేయడంలో ఇబ్బందులు నెలకొన్నాయి.

నూతన మెనూ ప్రకారం వారానికి రెండు సార్లు చికెన్, ఐదుసార్లు కోడిగుడ్లు, అరటిపండ్లు, అల్పాహారములు పూరి, వడ, చపాతి అందించాల్సి ఉన్నా సరుకులు, పాత్రలు, మ్యాన్‌పవర్ లేకపోవడంతో అవి అందడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం గురుకులాలకు టెండర్ ద్వారా సరుకులను అందజేస్తుందో అదే విధంగా సంక్షేమ వసతి గృహాలకు అమలు చేస్తేనే నూతన డైట్ మెనూ లక్ష్యం నెరవేరుతుంది. ఈ విషయమై ఇటీవల వార్డెన్ అసోసియేషన్ నాయకులు హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ వెల్ఫేర్ కమిషనర్‌ను కలిసి విన్నవించారు.

సరుకులను సరఫరా చేయాలి



సంక్షేమ వసతి గృహాలకు గురుకులాల మాదిరిగానే టెండర్ విధానంలో సరుకులను సరఫరా చేయాలి. అలాగే వంటపాత్రలను, మ్యాన్‌పవర్‌ను సమకూర్చాలి. – జయశీల, బీసీ హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్, ఆర్మూర్

హాస్టల్ సిబ్బంది మారడంతో..



హాస్టల్ సిబ్బంది మారడంతో ప్రస్తుతం నాణ్యతతో కూడిన భోజనం అందుతోంది. గతంలో ఉన్న సిబ్బంది నిర్వాకం వల్ల భోజన విషయంలో ఇబ్బందులు పడ్డాం. – దివ్య, హాస్టల్ విద్యార్థిని, ఆర్మూర్

క్లుప్తంగా

అలరించిన వైజ్ఞానిక ప్రదర్శన

పెర్కిట్: మామిడిపల్లి విజయ్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన అలరించింది. విజయ్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ అమృతలత విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవితా దివాకర్, ఎస్తేర్ రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వే జాబితా పరిశీలన

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలోని 19వ, 24వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన జాబితాను మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం పరిశీలించారు. ఎలాంటి తప్పులకు తావు లేకుండా సర్వేను నివేదికను అందించాలన్నారు. కౌన్సిలర్ రాము, సూపర్‌వైజర్ సలీం, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం..

మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో అంగన్‌వాడీ టీచర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కోసం చేస్తున్న వంటను పరిశీలించారు.

క్షత్రియలో పండుగల ఉత్సవం

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ పాఠశాలలో మంగళవారం సీబీఎస్ఈ విద్యా ప్రణాళికలో భాగంగా దేశంలోని రాష్ట్రాలకు సంబంధించిన పండుగల ఉత్సవం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అల్జాపూర్ వీరేంద్ర, ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహ స్వామి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న పాండే, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు అందజేత



బోధన్‌టౌన్: బోధన్ ఆస్పత్రిలో మతిస్థిమితం లేని పేషెంట్ సాయన్నకు సంబంధించిన రూ. 32 వేల నగదును ఆయన కుమారుడికి సిబ్బంది అందించారు. పట్టణ శివారులోని పసుపు వాగు వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నాడని 108 అంబులెన్స్‌కు సమాచారం అందడంతో వారు సదరు వ్యక్తిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. అంబులెన్స్‌లో అతని వద్ద రూ. 32 వేలు ఉండడంతో వివరాలు తెలుసుకున్న సిబ్బంది తడవు ఖుశ్వంత్ చంద్ర, సెక్యూరిటీ గార్డు అనిల్‌కుమార్ బాధిత కుమారుడికి అందజేశారు.

ఘనంగా సునీల్‌రెడ్డి జన్మదినం

సాక్షి నెట్‌వర్క్: బాల్కొండ, ముప్కాల్, మెండోరా, వేల్పూర్, కమ్మర్‌పల్లి మండలాల్లో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఆర్థికసాయం అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాంనగర్‌కు చెందిన చౌల్ అశోక్ ఓ షాప్‌లో పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఈఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ సీఏ ఈరవత్రి రాజశేఖర్ మంగళవారం రూ. పదివేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్గుల్ సురేశ్, బదాం రాజ్‌కుమార్, జక్కుల చంద్రశేఖర్, గుజరాతీ శ్రీనివాస్, దొండి గంగమోహన్, సడక్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు వినతి

బోధన్‌టౌన్: పట్టణంలోని అతిపురాతనమైన చారిత్రక కట్టడంపై వస్త్రాన్ని కప్పడం సరికాదని, వస్త్రం కప్పిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు కొలిపాక బాలరాజు, సుధాకర్‌చారి, మాసిని వినోద్, వాసు, అరవింద్, గౌతమ్, రవీందర్, శివ, అమృత్ తదితరులు పాల్గొన్నారు.



